సాక్షి
ములుగు

శుక్రవారం | 27 | జనవరి | 2023



అసౌకర్యం కలగకుండా...

మేడారం మినీ జాతరలో భక్తులకు అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు ములుగు డీపీఓ వెంకయ్య తెలిపారు.

- 8లో ▸



కేసీఆర్ సేవలు దేశానికి అవసరం

తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలంటే కేసీఆర్ సేవలు దేశానికి అవసరమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.2^{0} /16.1^{0}

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన ఎండ ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

అమరుల త్యాగాలు మరవొద్దు



భూపాలపల్లి: దేశ స్వాతంత్య్రం కోసం పోరాటం చేసి అమరులైన వారిని మరువొద్దని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ది కాకతీయఖని లారీ అసోసియేషన్, టీబీజీకేఎస్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్రం కోసం పోరాడి అమరులైన వారిని స్మరించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం



కాటారం: వసంతపంచమిని పురస్కరించుకొని కాటారం మండలం చింతకానిలో స్వయంభూ చెన్నకేశవస్వామి ఆలయంలో గురువారం కల్యాణ మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదమంత్రోచ్చరణల నడుమ భూనీల సహిత చెన్నకేశవ స్వామి వివాహం ఘనంగా జరిపించారు. చింతకానితో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు కల్యాణం వీక్షించడానికి తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'జగదాంబ మాత' ఆలయ ప్రారంభోత్సవం



కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపం పుహౌస్‌లో వసంత పంచమిని పురస్కరించుకొని నిర్మాణ ఏజెన్సీ సంస్థ ×జగదాంబ మాత× అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. గురువారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలను కాళేశ్వరం వేదపండితులతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్మాణ సంస్థ పంపుహౌస్ నిర్మాణ సమయంలో నిర్మించాలని అనుకున్నప్పటికీ నిర్మించ లే దు. గతేడాది జూలైలో వచ్చిన వరదలతో ము నిగిన విషయం తెలిసిందే. మళ్లీ వరదలు సంభవించకూడదనే ఉద్దేశంతో పంపుహౌస్ వద్దనే జగదాంబ మాత ఆలయం నిర్మించినట్లు తెలి సింది. ఎలాంటి ఆపదలు రావొద్దని, నిర్విరా మంగా ఏ పనైనా జరుగాలని ఆలయ నిర్మా ణం చేసినట్లు సమాచారం. ఏజెన్సీ, ఇరిగేషన్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయ వ్యవహారం కూడా రహస్యంగానే చే స్తుండడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోరాటాలతోనే ప్రజా సమస్యల పరిష్కారం

భూపాలపల్లి అర్బన్: పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని ప్రజాసంఘాల పోరాట ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్.వీరయ్య తెలిపారు. భూపాలపల్లి పట్టణంలో సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న నివాస స్థలాల భూ పోరాటాలకు గురువారం ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రజలు ఏదైనా పోరాటాలతోనే సాధించుకుంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50పైగా భూపోరాట సెంటర్లలో ఇండ్ల స్థలాల పోరాటం నడుస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కూడా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. పట్టణంలోని గుడిసెవాసులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతి గుడిసెవాసికి డబుల్ బెడ్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిలు, రాజయ్య, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

కేసు నమోదు

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని ఎర్రచెరువు శిఖం భూమిలో గుడిసెలు ఏర్పాటు చేయిస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సీపీఎం, సీపీఐలకు చెందిన నాయకులు బందు సాయిలు, కంపెటి రాజయ్య, వెలిశెట్టి రాజయ్య, మామిడి రమేష్, కొరిమి రాజ్‌కుమార్, కుడుదుల వెంకటేష్‌తో పాటు మరికొంతమంది కార్యకర్తలు ప్రభుత్వ శిఖం భూమి సర్వేనంబర్ 280, 281, 282, 283, 284, 285, 286లోకి అక్రమంగా ప్రవేశించి గుడిసెలు వేసి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేసినట్లు ఇన్‌చార్జ్ గిర్దావర్ ప్రదీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అభివృద్ధికి పాటుపడుదాం

- కలెక్టర్ కృష్ణ ఆదిత్య
- ఘనంగా గణతంత్ర వేడుకలు

ములుగు: అన్ని శాఖల అధికారులు ఐకమత్యంతో ముందుకు సాగి జిల్లా అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో గురువారం 74వ గణతంత్ర దినోత్సవంనిర్వహించారు. ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్‌తో కలిసి కలెక్టర్ కృష్ణ ఆదిత్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. స్వాతంత్య్ర సమర యోధులు బాసాని లక్ష్మీనారాయణకు శాలువా కప్పి సన్మానించారు. ఇటీవల జిల్లా ఉద్యోగులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ గౌస్ ఆలం, ఏఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వైవీ గణేష్, ఆర్డీఓ కూతాటి రమాదేవి, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

జెండా ఆవిష్కరణ అనంతరం తన చాంబర్‌లో కలెక్టర్ కృష్ణ ఆదిత్య విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేస్తుందని తెలిపారు. జిల్లా ప్రజలకు వైద్యం, విద్య, పోషకాహారం అందించేందుకు ఆయా శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి నెలలో జరిగే మినీ మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు వారాంతరాల్లో అధికసంఖ్యలో తరలివస్తున్న కారణంగా భక్తుల కోసం మూడు వసతి గృహాల నిర్మాణాలను జూలైలో పూర్తి చేస్తామన్నారు. రూ.1.7కోట్లతో ములుగు మండలం ఇంచర్ల, గోవిందరావుపేట మండలం చల్వాయితోపాటు ఎస్ఎస్ తాడ్వాయి మండల కేంద్రంలో నిర్మాణాలను పూర్తిచేసి ప్రత్యేకంగా కిచెన్ షెడ్లను సైతం నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో షెడ్‌లో 300మంది భక్తులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వీటితోపాటు జిల్లాకేంద్రంలోని గట్టమ్మ దేవాలయం వద్ద మరో షెడ్ నిర్మాణానికి తగిన ప్లానింగ్ చేస్తున్నట్లు తెలిపారు. బండారుపల్లి పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో జరుగుతున్న సమీకృత కలెక్టరేట్ భవనానికి పోలీసు కార్యాలయానికి స్థలం కేటాయించామని టెండర్ ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగుల కోసం సఖి సెంటర్ పక్కన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే ప్రాంతంలో రూ.1.4 ఓట్లతో చైల్డ్ హోంను సైతం నిర్మిస్తున్నట్లు చెప్పారు. భరోసా సెంటర్‌ను కూడా ఇక్కడే నిర్మించడానికి ప్రతిపాదనలు చేశామన్నారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థుల కోసం గ్రూప్స్ పరీక్షలలో శిక్షణ పొందేందుకు ఏటూర్‌నాగారం ఐటీడీఏ ద్వారా ఏర్పాటుచేసిన ఉచిత శిక్షణ కేంద్రాలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. శిక్షణ కేంద్రాలలో శిక్షణ పొందిన 98శాతం అభ్యర్థులు సక్సెస్ రేట్ సాధించారని సంతోసం వ్యక్తంచేశారు. మన ఊరు మనబడి పథకం కింద 125 ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నుంచి రూ.50 కోట్లు విడుదల అయ్యాయని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీచేశామని అన్నారు. ప్రతి మండలంలో ఒక స్కూల్‌ను ఎంపిక చేసి ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను ముందస్తుగానే పూర్తి చేయడానికి ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ఎన్‌హెచ్ విస్తరణ పనులను వర్షాకాలం లోపే పూర్తయ్యేట్లు చూస్తామన్నారు. ఎన్‌హెచ్ అధికారులను సమన్వయం చేసుకొని ట్రాఫిక్ రద్దీగా ఉండే గ్రామాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. జంగాలపల్లి నుంచి గాంధీనగర్, ఏటురునాగారం నుంచి భద్రాచలం వెళ్లే రహదారులను జాతీయ రహదారులుగా మార్చే అవకాశం ఉందన్నారు. జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టి వెంకటాపురం(కె) మండలంలోని బీసీ మర్రిగూడెం, ఏటూరునాగారం, జిల్లాకేంద్రంలో డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీపీఆర్వో రఫిక్ పాల్గొన్నారు.



గౌరవవందనం స్వీకరిస్తున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఎస్పీ సంగ్రాంసింగ్ జీ పాటిల్



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృష్ణ ఆదిత్య



ఏటూరునాగారం: నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఏటూరునాగారం: నృత్యం చేస్తున్న విద్యార్థులు

గిరిజనుల అభ్యున్నతికి పాటుపడుతాం

గణతంత్ర దినోత్సవంలో ఐటీడీఏ పీఓ అంకిత్

- వివరాలు 8లో ▸

ఎస్పీ కార్యాలయంలో వేడుకలు



జెండా వందనం చేస్తున్న ఎస్పీ

ములుగు: 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను గురువారం జిల్లాకేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ సంగ్రాం సింగ్ జీ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎంతోమంది పోలీసుల ప్రాణత్యాగాలతో ప్రజలు స్వేచ్ఛగా జీవిస్తున్నారని అన్నారు. జిల్లా ప్రజల సంక్షేమానికి పోలీసు శాఖ కట్టుబడి ఉందని చెప్పారు. ప్రభుత్వ కొలువుల నేపథ్యంలో శాఖ తరపున ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు, భూపాలపల్లి జిల్లా ఓఎస్డీ గౌస్ ఆలం, ఏఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీకి ఆంత్రిక్ సురక్ష సేవా పతకం



ఎస్పీ సంగ్రాం సింగ్ జీ పాటిల్



ఎస్సై వెంకటేశ్వర్‌రావు



ఎస్సై తిరుపతి రావు

ములుగు: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భద్రతా కార్యకలాపాలలో సుమారు రెండు సంవత్సరాల పాటు నిరంతర సేవలు అందించిన వారికి కేంద్ర ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. ఇందులో ఎస్పీ డాక్టర్ సంగ్రాంసింగ్ జీ పాటిల్ తో పాటు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు సట్ల కిరణ్‌కుమార్, తిరుపతిరావు, ఎస్సైలు కె.తిరుపతిరావు, సీహెచ్.వెంకటేశ్వర్‌రావు, బాంబ్ స్క్వాడ్ టీం సభ్యులు సయ్యద్ ముస్తాఫా, ఎం.రాజేశ్, కానిస్టేబుళ్లు వెంకటేశ్వరావు, భిక్షపతి, కిరణ్, ఏఆర్ కానిస్టేబుళ్లు సుధాకర్, అనిల్, డిస్ట్రిక్ట్ గార్డ్ ప్రేమ్‌సాగర్ ఎంపికయ్యారు. వీరిని ఎస్పీ అభినందించారు.

సమరయోధులను స్మరించుకోవాలి

ఎస్పీ సురేందర్‌రెడ్డి

భూపాలపల్లి: స్వాతంత్య్రం కోసం పోరాడిన సమరయోధులను ప్రతీ ఒక్కరు స్మరించుకోవాలని ఎస్పీ జె.సురేందర్‌రెడ్డి కోరారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గురువారం జిల్లా పోలీసు కార్యాలయం, ఆర్మ్‌డ్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్వాతంత్రానంతరం దేశంలో సర్వసత్తాక, సార్వభౌమ, లౌకికరాజ్యంగా రూపుదిద్దుకోవడంలో రాజ్యాంగానిది కీలకపాత్ర అని కొనియాడారు. దేశంలోని వివిధ రకాల మతాలు, కులాలు, జాతుల ప్రజలను ఒకేతాటి మీద ఉంచుతూ దేశ సమగ్రతను కాపాడుతున్న రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కుల వల్లే అన్ని వర్గాల ప్రజలకు విద్య, ఉద్యోగ రంగాలలో సమాన అవకాశాలు లభిస్తున్న విషయం గుర్తు చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎస్పీ శ్రీనివాసులు, భూపాలపల్లి డీఎస్పీ రాములు, వర్టికల్ డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా పరిధిలోని సీఐలు, ఎస్సైలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న ఎస్పీ

సరస్వతీ నమస్తుభ్యం



సరస్వతీ ఆలయంలో హోమాది పూజలు



ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

కాళేశ్వరం: చదువుల తల్లి సరస్వతీ అమ్మవారి జన్మదినం సందర్భంగా కాళేశ్వరాలయం అనుబంధ దేవాలయం మహా సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. గురువారం వసంత పంచమి పురస్కరించుకొని ఆలయంలో మొట్టమొదటి సారిగా హోమాది పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రమానికి విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చిన్నారులకు అక్షర స్వీకార మహోత్సవాలను దేవస్థానం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వారికి ఆలయం తరపున పలక, బలపాలు అందజేశారు. మధ్యాహ్నం వరకు పూజా కార్యక్రామలు కొనసాగాయి. అనంతరం స్వామివారి ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. దీంతో ఆలయం ఆవరణలో భక్తుల సందడి కనిపించింది. ఈ కార్యక్రమంలో ఈఓ శనిగెల మహేష్, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, మాజీ సర్పంచులు రాంరెడ్డి, మాధవి, దేవస్థానం మాజీ డైరెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు పలకలు అందజేస్తూ..

భ్రమరాంబిక ఆలయ వార్షికోత్సవం

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయానికి ఉత్తర భాగంలో నిర్మించిన భ్రమరాంబిక ఆలయంలో గురువారం తొమ్మిదో వార్షికోత్సవాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకుని ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యములతో విశేష అభిషేకం, నవకలశ స్నపనం, నీరాజన మంత్రపుష్పం, చండీ హవన కార్యక్రమాలు ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ మాఘమాసం బహుళ పంచమి(వసంత పంచమి) కావడంతో అమ్మవారిని విశేషంగా అర్చించామని తెలిపారు. దేవాలయ నిర్మాణ దాత సరాబు రంగయ్య దంపతులు, కుటుంబ సభ్యులు, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి పాల్గొన్నారు.

పోలీస్‌శాఖలో బదిలీల కుదుపు

ఉమ్మడి వరంగల్‌లో పెద్ద ఎత్తున అధికారుల బదిలీ

- ములుగు ఎస్పీ సంగ్రామ్ సింగ్ బదిలీ... ఆయన స్థానంలో గౌస్ ఆలం
- కమిషనరేట్‌లో పలువురికి స్థాన చలనం.. పెద్దపల్లి డీసీపీగా గైక్వాడ్ రఘునాథ్
- పీటీసీ ప్రిన్సిపాల్‌గా సతీష్... మామునూరు కమాండెంట్‌గా సింధుశర్మ
- వరంగల్ డీసీపీలుగా కరుణాకర్, ఎంఏ భారీలు
- మొత్తం 14 మందికి స్థానచలనం

సాక్షి ప్రతినిధి, వరంగల్: ఉమ్మడి వరంగల్‌లో పోలీస్ ఉన్నతాధికారుల మూకుమ్మడి బదిలీలు చర్చనీయాంశంగా మారాయి. చాలాకాలం తర్వాత ఎస్పీ(ఐపీఎస్, నాన్‌కేడర్), అడిషనల్ ఎస్పీ (ఐపీఎస్, నాన్ ఐపీఎస్), గ్రూప్–1 తదితర స్థాయిల అధికారులకు స్థానచలనం కలిగింది. కొత్త జిల్లాల ఏర్పడిన తర్వాత పలుమార్లు బదిలీలు జరిగినా పెద్దఎత్తున ఎస్పీలు, డీసీపీలను మార్చడం ఇదే తొలిసారి. ఒకేచోట నాలుగైదేళ్ల వరకు పనిచేసిన వారితోపాటు వివిధ విభాగాల్లో పనిచేసిన వారికి కూడా స్థానచలనం కలిగించారు. ఈ ఏడాదిలోనే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మూకుమ్మడి బదిలీలు జరిగాయన్న చర్చ ఉంది. కాగా బుధవారం అర్ధరాత్రి వెలువడిన ఈ బదిలీ ఉత్తర్వులలో ఐపీఎస్ అధికారులు సంగ్రామ్ సింగ్ పాటిల్, అశోక్‌కుమార్, గౌస్ ఆలం, వైభవ్ గైక్వాడ్ రఘునాథ్‌ల తోపాటు పలువురికి బదిలీలు అయ్యాయి. అయితే బదిలీ అయిన టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పుల్లా శోభన్‌కుమార్‌ల స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

అధికారుల బదిలీలు, పోస్టింగుల వివరాలు..



గౌస్ ఆలం



పుల్లా కరుణాకర్



కేకన్ సుధీర్ రామ్‌నాథ్

- 2015 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ములుగు ఎస్పీ పాటిల్ సంగ్రామ్‌సింగ్‌ను బదిలీ చేస్తూ హైదరాబాద్‌లోని విజిలెన్స్ విభాగానికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (విజిలెన్స్)గా పోస్టింగ్ ఇచ్చారు.
- సంగ్రామ్‌సింగ్ స్థానంలో ఏటూరునాగారం అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్ గౌస్ ఆలంను నియమించారు. ఈయన 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు.
- ఏటూరునాగారం ఏఎస్పీగా గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఉన్న 2020 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సిరిశెట్టి సంకీత్‌ను నియమించారు.
- వరంగల్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ (అడ్మిన్), కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను ఇక్కడినుంచి బదిలీ చేస్తూ రామగుండం కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి డీసీపీగా పోస్టింగ్ చ్చారు.
- ములుగు అసిస్టెంట్ సూపరింటెండెంట్ పోలీసు (ఏఎస్పీ)గా ఉన్న కేకన్ సుధీర్ రామ్‌నాథ్ (ఐపీఎస్–2018 బ్యాచ్)ను బదిలీ చేస్తూ రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల డీసీపీగా నియమించారు.
- 2019 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన అసిస్టెంట్ పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ గ్రేహౌండ్స్ నుంచి డిప్యుటేషన్‌పై ములుగు ఏఎస్పీగా కూడా పనిచేస్తుండగా, బదిలీలలో భాగంగా అక్కడే ఓఎస్డీ (ఆఫీసర్–ఆన్–స్పెషల్ డ్యూటీ)గా నియమించారు.
- వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీగా ఉన్న కె.వెంకటలక్ష్మిని హైదరాబాద్‌కు బదిలీ చేస్తూ సీఐడీ విభాగంలో ఎస్పీగా నియమించారు.
- వెంకటలక్ష్మి స్థానంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్–కేడర్) పుల్లా కరుణాకర్‌ను బదిలీ చేశారు.
- వరంగల్ కమిషనరేట్‌లో ఉండి పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్–కేడర్) ఎస్.అశోక్ కుమార్‌కు హైదరాబాద్ సిటీ ట్రాఫిక్–2 డీసీపీగా పోస్టింగ్ ఇచ్చారు.
- పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మరో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్–కేడర్) ఎం.ఎ.భారీని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా నియమించారు.
- వరంగల్ రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా ఉన్న అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పుల్లా శోభన్‌కుమార్‌ను సైబరాబాద్ ఎస్‌ఓటీ–2 అదనపు డీసీపీగా బదిలీ చేశారు.
- వరంగల్ పోలీస్ ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ పూజను హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీకి డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ, ఆమె స్థానంలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న పోలీస్ సూపరింటెండెంట్ (నాన్–కేడర్) చోడగిర సతీష్‌ను నియమించారు.
- వరంగల్ ఇంటెలిజెన్స్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (నాన్–కేడర్) ఆర్.భాస్కర్‌కు వరంగల్ ఇంటెలిజెన్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పోస్టింగ్ ఇచ్చారు.
- టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ (మామూనూరు) కమాండెంట్ ఇ.శివప్రసాద్‌ను బదిలీ చేస్తూ ఆయన స్థానంలో 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సింధు శర్మను నియమించారు.

విద్యార్థినికి అద్భుత అవకాశం

బాధ్యతాయుతంగా పని చేయండి

చాలెంజ్‌గా తీసుకుని నిరంతర విద్యుత్ సరఫరా

- వివరాలు 10లో ▸

'కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి'

నర్సంపేట: అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేసేంతవరకు పోరాటాలు చేయాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం పిలుపునిచ్చారు. పట్టణంలోని అరవింద, జగదానంద రైస్ మిల్, ఐరన్, కిరాణం, ఫర్టిలైజర్ దుకాణాల్లో పనిచేసే మంద మల్లయ్య కూటుకు చెందిన 42 మంది హమాలీలు గురువారం ఏఐఎఫ్‌టీయూ(న్యూ)లో చేరారు. అనంతరం మంద మల్లయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లేశం మాట్లాడారు. దేశం, రాష్ట్రంలో అసంఘటిత రంగంలో కోట్లాది మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి కనీస వేతనాలు అమలు చేయాలని, పనిచేసే ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకులు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు మెరుగు జనార్దన్, బొల్లెన రమేశ్, ఈరెల్లి రామచందర్, రాములు, ఈశ్వరయ్య, రవి, భూసాని మల్లయ్య, యేసుపతి, నక్క అశోక్, ఏశబోయిన ఐలయ్య, నల్ల సతీష్, లింగయ్య, జెట్టి రాజు, కీసరి రాజు, పరుషబోయిన లింగయ్య, వావిళ్ల రాజు తదతరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి పాటుపడుతాం

- ఐటీడీఏ పీఓ అంకిత్
- ఘనంగా 74వ గణతంత్ర దినోత్సవం
- అలరించిన విద్యార్థుల నృత్యాలు



ఐటీడీఏ క్రీడా మైదానంలో జెండా వందనం చేస్తున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: గిరిజనుల అభ్యున్నతి కోసం ఐటీడీఏ ద్వారా పాటుపడుతామని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. 74వ గణతంత్ర వేడుకల్లో భాగంగా ఏటూరునానాగారం ఐటీడీఏ కార్యాలయం, కొమురం భీం క్రీడా మైదానంలో జాతీయజెండాను పీఓ అంకిత్ ఎగురవేశారు. ముందుగా గౌరవ వందనం స్వీకరించారు. అక్కడ జాతీయ జెండా ఎగురవేసిన అనంతరం మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలు, గిరిజనులను మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తుందన్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంతో పాటు, ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. శనిగకుంట గ్రామంలో అగ్నికి ఆహుతైన బాధితులకు ఇళ్ల నిర్మాణాలు, సర్టిఫికెట్లు కోల్పోయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, నిత్యావసర, గృహ సామాను అందించి ఆదుకున్నామన్నారు.

విద్యావిభాగం

ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 2022–23 విద్యా సంవత్సరంలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రాథమిక పాఠశాలలు, కళాశాలల్లోని 12,971మంది విద్యార్థులకు సౌకర్యాలు, భోజన వసతి, స్టడీ అందిస్తున్నామని పీఓ తెలిపారు. పదో తరగతి పరీక్షల్లో నూటికి నూరుశాతం ఉత్తమ ఫలితాలు రావాలనే ఉద్దేశంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. వారికి స్పెషల్ కిట్లను అందించామని, చలివేయకుండా స్వెటర్స్ ఇచ్చామన్నారు. రాష్ట్ర క్రీడలను నిర్వహించి విజయవంతం చేశామని తెలిపారు.

వైద్య ఆరోగ్య సేవలు

ఐటీడీఏ పరిధిలో 755 వైద్య శిబిరాలను నిర్వహించి 32,999మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చామని పీఓ వివరించారు. స్త్రీలకు ప్రత్యేక పరీక్షలు చేసి డెలవరీలను ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఐటీడీఏ ద్వారా మూడు అంబులెన్సులను ఏర్పాటు చేసి గిరిజనులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 2,233 మందికి ఉచితంగా సేవలు అందాయన్నారు. కోవిడ్ వ్యాక్సినేషన్ 18 సంవత్సరాలు నిండిన వారికి మొదటి డోసు కింద 2.82 లక్షలు ఇచ్చామని, రెండో డోసు కింద 2.68లక్షలు, బూస్టర్ డోసులు 1.62 లక్షలు ఇచ్చామన్నారు.

ఇంజనీరింగ్ విభాగం ద్వారా..

ఇంజనీరింగ్ విభాగం ద్వారా గిరిజన భవనాలు, సబ్ సెంటర్లు, బీటీ రోడ్లు, పాఠశాలల మరమ్మతులు చేపట్టినట్లు పీఓ తెలిపారు. 1,009 రకాల పనులకు రూ.424.50కోట్లు మంజూరు కాగా అందులో 959 పనులు పూర్తి చేశామని, 51 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు రూ.309.56కోట్లు ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ పర్యవేక్షణలో ఖర్చుచేసినట్లు పీఓ తెలిపారు. ట్రైకార్ ద్వారా 6,761 యూనిట్లకు రూ.55.64 కోట్లు మంజూరయ్యాయని, వీటి ద్వారా రుణాలు, స్వయం ఉపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో భాగంగా నిరుద్యోగులకు ఉచిత ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగాలు వచ్చే విధంగా చర్యలు చేపట్టామన్నారు. మత్స్యసొసైటీలు ఏర్పాటు చేయించి మత్స్యపారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేశామని, 15 మండలాల్లో 814 చెరువులకు 61 సొసైటీలు రిజిస్ట్రేషన్ అయ్యాయన్నారు. 1.62 కోట్ల చేప పిల్లలు ఉచితంగా అందజేశామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం పెంపుదల కోసం 500మంది రైతులను గుర్తించి వారితో ప్రకృతి వ్యవసాయం, గిరివికాసం కింద 3,648మందిని గుర్తించి వారికి రూ.19.95 కోట్లతో బోర్లు, మోటార్లు, ట్యూబ్‌వెల్స్ ఇచ్చామన్నారు. గిరిజన సహాయ నిధి కింద 102మంది గిరిజనులకు రూ. 27.19 కోట్లు ఇచ్చామని చెప్పారు. అటవీహక్కుల చట్టం ద్వారా 17,006 మందికి రూ.5వేల చొప్పున రైతుబంధు పథకం ద్వారా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. పోడు భూముల కోసం 53,450 మంది నుంచి 1.73 లక్షల ఎకరాలకు దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఏఓ దామోదరస్వామి, ఎస్‌ఓ రాజ్‌కుమార్, మేనేజర్ శ్రీనివాస్, పీహెచ్‌ఓ రమణ, ఏసీఎంఓ కోడి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు దేశభక్తి గీతలకు నృత్యాలు చేశారు. ఆట పాటలతో విద్యార్థినులు గణతంత్ర వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. నృత్యాలు చేసిన విద్యార్థులకు పీఓ అంకిత్, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ బహుమతులు అందజేశారు.

మాట్లాడుతున్న పీఓ అంకిత్





బహుమతి అందుకుంటున్న విద్యార్థినులు

ఉత్తములకు 'ప్రశంసలు'



ఉత్తమ అవార్డు అందజేస్తున్న కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎమ్మెల్యే గండ్ర

74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జిల్లాలోని వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులను ప్రదానం చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందజేశారు.

– భూపాలపల్లి





జెడ్పీ కార్యాలయంలో జెండా ఎగరేస్తున్న సీఈఓ రఘువరన్



సూచిక బోర్డును ఢీకొట్టిన బైక్

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం – కమలాపురం గ్రామాల మధ్య రోడ్డు పక్కనే ఉన్న సూచిక బోర్డును ద్విచక్రవాహనం అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఏటూరునాగారం గ్రామ పంచాయతీ నర్సరీ వద్ద గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. కన్నాయిగూడెం మండలం ముప్పనపల్లి గ్రామానికి చెందిన ఎన్నంపెల్లి రాంబాబు బయ్యారంలో వివాహానికి హాజరై తిరిగి ముప్పనపల్లికి వెళ్తున్నాడు. ఏటూరునాగారం నర్సరీ వద్ద బైక్ అదుపుతప్పి సూచిక బోర్డును ఢీకొట్టింది. దీంతో రాంబాబు కుడికాలు విరిగింది. 108 వాహనంలో ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

వ్యక్తి బలవన్మరణం

మహదేవపూర్: మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామానికి చెందిన మేకల రవి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మేకల రవి కొంతకాలంగా భార్యతో తరుచు గొడవపడేవాడు. నెల రోజుల క్రితం అతడి భార్య పిలలను తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై మద్యానికి బా నిసయ్యాడు. ఈ క్రమంలో వారం క్రితం అత్తగారింటికి వెళ్తానని బంధువుల వద్ద డబ్బు తీసుకొని గ్రామంలో కనిపించడం లేదు. అతడి ఇంట్లో నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు తలుపులు తీసి చూడగా ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి అక్క ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య పనులు

- మేడారం మినీజాతర విధుల్లో 300 మంది కార్మికులు, 150 మంది సిబ్బంది
- 'సాక్షి'తో ములుగు పంచాయతీ అధికారి వెంకయ్య



మరుగుదొడ్ల మరమ్మతులను పరిశీలిస్తున్న డీపీఓ వెంకయ్య



రోడ్డును శుభ్రం చేస్తున్న కార్మికులు

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతరలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టనున్నట్లు ములుగు డీపీఓ వెంకయ్య తెలిపారు. గురువారం మేడారంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన అనంతరం ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగే మినీ జాతర (మండమెలిగె) ఉత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారనే అంచనాతో ప్రణాళికాబద్ధంగా పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. జాతర అనంతరం పోస్ట్ జాతరలో కూడా భక్తులకు, స్థానిక ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతామని పేర్కొన్నారు. మినీ జాతర నేపథ్యంలో ఇప్పటి నుంచే ముందస్తుగా భక్తులు వస్తుండడంతో పది రోజుల క్రితం నుంచే పనులను ప్రారంభించామని వెల్లడించారు.

జాతరకు 300మంది కార్మికులు..

మినీజాతరలో పారిశుద్ధ్య పనుల కోసం 300మంది కార్మికులను ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఓ వెంకయ్య తెలిపారు. జంపన్నవాగు, చిలుకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్ వై జంక్షన్, ఊరట్టం స్తూపం, రెడ్డిగూడెం, మేడారం గ్రామంతో పాటు భక్తులు విడిది చేసే ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జాతరను సెక్టార్ వారీగా విభజించి ఏయే ప్రాంతాల్లో ఎంత మంది కార్మికులను ఏర్పాటు చేయాలనేది పంచాయతీ అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. జాతర నిర్వహణకు 150 మంది సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. షిఫ్ట్‌ల వారీగా కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేపట్టి ఎక్కడా కూడా చెత్తా చెదారం లేకుండా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తామన్నారు. బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

షెడ్ల వద్ద ఏర్పాట్లు...

మేడారంలోని ఐదు షెడ్ల వద్ద భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేపడుతున్నట్లు డీపీఓ తెలిపారు. షెడ్ల వద్ద మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావడంతో పాటు వాటికి వాటర్ కనెక్షన్ల మరమ్మతులు చేస్తున్నామన్నారు. మరుగుదొడ్ల సెప్టిక్ ట్యాంకులను కూడా శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. షెడ్లలో ఫ్యాన్లు, లైటింగ్ సిస్టం కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు కూడా ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వస్తువులు, చెత్తచెదారం పడేయకుండా సహకరించాలని కోరారు. జిల్లా అధికారుల సూచనలు, సలహాల మేరకు పారిశుద్ధ్య సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

మోకుజారి గీత కార్మికుడి మృతి



మోకుజారి మృతి చెందిన కుమారస్వామి



కుమారస్వామి (ఫైల్)

చిల్పూరు: మోకు జారి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం మల్కాపూర్ పరిధి కొమ్ముగుట్టలో గురువారం జరిగింది. ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ తెలిసిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగంపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు కుమారస్వామి(55) కొన్నేళ్ల క్రితం కుటుంబ పోషణ నిమిత్తం మల్కాపూర్ పరిధి కొమ్ముగుట్టకు చేరుకున్నాడు. గీత వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం మధ్యాహ్నం కల్లు గీసేందుకు తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి ఒక గెల గీసి మరో గెల వైపు తిరుగుతుండగా మోకు జారింది. దీంతో పైనుంచి కిందివరకు జారడంతో తీవ్రగాయాలై చెట్టుపైనే మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే తాటి చెట్టే ఊపిరి తీసేఅంటూ మృతుడి భార్య పుష్పలీల రోదించిన తీరు కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సర్పంచ్‌లు ఏదునూరి రవీందర్, కొంగరి రవి, ఉప సర్పంచ్‌లు కంకటి రాజన్న, బబ్బుల వంశీ, బీఆర్ఎస్ నాయకుడు పోలేపల్లి రంజిత్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పైన చెరుకు.. లోపల బెల్లం

- లారీ సీజ్.. కేసు నమోదు



లారీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

దంతాలపల్లి: పైన చెరుకు లోపల నల్లబెల్లంతో వెళ్తున్న లారీని సీజ్ చేసినట్లు దంతాలపల్లి ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దంతాలపల్లి నుంచి సూర్యాపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో కానిస్టేబుళ్లు గణేష్, బగ్గ, వెంకటేశ్వర్లు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పోలీసులను చూసి లారీ డ్రైవర్ వాహనాన్ని పక్కకు నిలిపాడు. లారీలోని మరో వ్యక్తి పారిపోయాడు. దీంతో కానిస్టేబుళ్లు లారీలో తనిఖీ చేయగా పైన చెరుకు లోన 30 బస్తాల నల్లబెల్లం కనిపించింది. దీంతో డ్రైవర్ దుంప వెంకన్న, పారిపోయిన వ్యక్తి ధారావత్ గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేట చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. న్యూశాయంపేటకు చెందిన అదే ఉమేష్ ఈనెల 24న ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు న్యూశాయంపేట చెరువులో పడి మృతి చెందాడు. గురువారం ఉమేష్ మృతదేహం చెరువులో తేలడంతో బయటకు తీశారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సట్టా స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్ చమన్‌లోని ఓ ఇంట్లో గురువారం సాయంత్రం సట్టా స్థావరంపై దాడి చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఉర్సు కరీమాబాద్‌లోని అంకం శ్రీకాంత్ అనే వ్యక్తి తన ఇంట్లో సట్టా నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు వరంగల్ టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ ఆదేశాలు, ఏసీపీ జితేందర్‌రెడ్డి సూచనల మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా దాడి చేసి శ్రీకాంత్ నుంచి రూ.3,520ల నగదు, సెల్‌ఫోను, ప్లేకార్డులను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై వడ్డెబోయిన లవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాటివనంలో పేకాట

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురంలోని తాటివనం పేకాటరాయుళ్లకు అడ్డాగా మారింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రియల్టర్లతోపాటు ఆటో డ్రైవర్లు వేర్వేరుగా పేకాట ఆడుతున్నారు. ఈమేరకు టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు గురువారం దాడులు చేయగా ఆటో డ్రైవర్లు చిక్కగా, రియల్టర్లతో పాటు కొంతమంది ప్రజాప్రతినిధులు పరారైనట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే పట్టుబడిన వారు ఆటో డ్రైవర్లుగా పోలీసులు చెబుతున్నారు. వారి వద్ద నుంచి రూ.8,090 నగదు స్వాధీనం చేసుకున్నారు. రెండు ఆటోలతో పాటు మరో రెండు బైక్‌లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేసీఆర్ సేవలు దేశానికి అవసరం



తొర్రూరులో జెండా వందనం చేస్తున్న మంత్రి దయాకర్‌రావు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా అమలు కావాలంటే కేసీఆర్ సేవలు దేశానికి అవసరమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 100 అడుగుల జాతీయ పతాక ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ డాక్టర్ పొనుగోటి సోమేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండా ఎగరవేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగానే పాలన సాగుతుందన్నారు. దేశాన్ని ముందుకు నడిపించే రాజనీతి గల నాయకుడు కేసీఆర్ అని, ఆయన నాయకత్వం దేశానికి అవసరమని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్, కల్యాణలక్ష్మి, దళితబంధు తదితర పథకాలు విజయవంతంగా అమలవుతుండటంతో దేశ ప్రజల దృష్టి తెలంగాణ వైపు మళ్లిందన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో తొర్రూరు మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య, గ్రామీణాభివృద్ధి కమిషన్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, జాతీయ పతాక ప్రతిష్ఠాపన కమిటీ ప్రతినిధులు శామకూరి ఐలయ్య, ధరావత్ జైసింగ్, చీకటి శ్రీనివాస్, దొంగరి శంకర్, కుర్ర శ్రీనివాస్, జిలుకర సురేందర్, ఆర్డీఓ రమేష్, డీఎస్పీ రఘు, తహసీల్దార్ నాగేంద్రప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పసుమర్తి శాంత, వైస్ సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గవర్నర్ వ్యవస్థను కించపరిచే విధంగా పనిచేస్తున్న తమిళిసై

పర్వతగిరి: రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ భారత రాజ్యాంగ వ్యవస్థను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలో పర్వతాల శివాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలచే ఎన్నుకోబడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కించపరిస్తే రాష్ట్ర ప్రజలను కించపరిచినట్లే అవుతుందన్నారు. తెలంగాణ గవర్నర్ కేంద్ర బీజేపీ ప్రభుత్వానికి ఏజెంట్‌గా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా గవర్నర్ సమాలోచన చేసి గౌరవాన్ని కాపాడుకునే విధంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.

ఏటీఎం కార్డులు మార్చి నగదు డ్రా

- నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై విజయరాంకుమార్

మహబూబాబాద్ రూరల్ : ఏటీఎం సెంటర్లలో డబ్బు డ్రా చేసుకునేందుకు వచ్చిన వారికి మాయ మాటలు చెప్పి ఏటీఎం కార్డులు మార్చి నగదు విత్‌డ్రా చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మహబూబాబాద్ టౌన్ ఎస్సై విజయరాంకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. విజయవాడలోని భవానీపురం ప్రాంతానికి చెందిన అలవుల వెంకటనాగసుధాకర్ జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో ఏటీఎం సెంటర్లకు వచ్చేవారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కార్డులు మార్చి నగదు డ్రా చేసుకునేవాడు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గుమ్ముడూరు ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల ఏటీఎం సెంటర్‌లో డిసెంబర్ 13న కార్డు మార్చి డబ్బు డ్రా చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. సమావేశంలో పీసీలు రుద్రయ్య, బాలరాజు, జావిద్ పాల్గొన్నారు.

పశువైద్యశాఖ ఏడీ ఆత్మహత్య

- నిజామాబాద్‌లో ఘటన
- పోలీసులకు లభ్యమైన సూసైడ్‌నోట్



శ్రీశైలం (ఫైల్)

హన్మకొండ/ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర పరిధిలోగల సారంగపూర్ డెయిరీఫాంలోని డిస్ట్రిక్ లైవ్ స్టాక్ డైయిరీ డెవలప్‌మెంట్ శాఖ కార్యాలయంలో బుధవారం రాత్రి నిజామాబాద్ వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ పెద్దకాసుల శ్రీశైలం(52) ఆత్మహత్యకు పాలపడ్డాడు. ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండకు చెందిన శ్రీశైలం గత ఏడాది వరంగల్ నుంచి నిజామాబాద్‌కు ఏడీగా బదిలీపై వెళ్లారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఆయన హనుమకొండలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి అందరు మంచిగా ఉండాలని తెలిపారు. తండ్రి మాటల్లో తేడాలు రావడంతో కుమారుడు రవితేజ వెంటనే నిజామాబాద్ వెళ్లాడు. శ్రీశైలం గదికి గడియ ఉండటంతో తలుపులు తొలిగించి తెరిచేసరికి ఆయన ఉరివేసుకొని ఉన్నారు. ఏడీ చనిపోయే ముందు సూసైడ్‌నోట్ రాశాడు. అందులో తన చావుకు ఎవరు కారణం కాదని ఉంది. కానీ సూసైడ్ నోట్‌ను గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడారా? లేదా ఆర్థిక కారణాలు, ఇతరత్రా కారణాలు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని హనుమకొండకు తరలించారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఏడాది క్రితం కుమార్తె వివాహం, డిసెంబర్ 4న పెద్ద కుమారుడి వివాహం జరిపించారు.

తొర్రూరులో విషాదఛాయలు

తొర్రూరు వాసి అయిన పెద్దకాసుల శ్రీశైలం ఆత్మహత్యతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తొర్రూరులో పాఠశాల, ఇంటర్ విద్య పూర్తిచేసిన ఆయన అనంతరం వెటర్నరీ విద్యను అభ్యసించి పశుగణాభివృద్ధి శాఖలో ఏడీ స్థాయికి ఎదిగారు. తొర్రూరుకు ఎప్పుడు వచ్చినా అందరితో కలగలపుగా ఉండేవాడని స్థానికులు పేర్కొన్నారు. ఆయన అకాల మరణంతో స్నేహితులు, బంధువులు విషాదంలో మునిగిపోయారు.